

కథా కౌముది

# నా దేవతిచ్చిన వరం

కృపాకర్ పోతుల

"ఇంతకు ముందు చదివిన పుస్తకవేఁగా, ఇంకా ఎన్నిసార్లు చదువుతావు? విసుగెయ్యట్లేదూ?" ప్రశ్నించింది శ్రీమతి విసుగ్గా.

"ఏం చెయ్యమంటావోయ్, నాకు నీలా వాట్సాపూ, ఫేసుబుక్కుల్లో చాటింగులు చెయ్యడాలూ, యూట్యూబులో 'వంటల వీడియోలు' చూసుకొని తరించడాలూ చేతకాదు మరి. కొనుకున్న పుస్తకాలు రెండూ చదివేసాను. తెగ బోరుకొడుతోంది. అందుకే మళ్ళీ చదువుతున్నాను. అయినా దీన్ని ఒక్కసారే చదివేనులే" అన్నాను డిఫెన్సివ్ గా... చదువుతున్న 'హాఫ్ ఆఫ్ ఎ యెల్లో సన్' పుస్తకాన్ని మడిచి, పక్కనే ఉన్న టీపాయ్ మీద పెడుతూ.

మూతి మూడువంకర్లు తిప్పిందావిడ. "ఎంతసేపూ నామీదా నా చాటింగుల మీదా సెటైర్లెయ్యకపోతే, అదేదో నువ్వు కూడా నేర్చుకోవచ్చుకదా. నేర్చుకున్నాక గాని తెలియదు నీకు.. ద హోల్ వర్ల్డ్ ఈజ్ అట్ యువర్ ఫింగర్ టిప్స్ అని" అంది ఇంగ్లీషులో యమవేళాకోళంగా. కాంప్యూటర్ల గురించీ, ఇంటర్నెట్ గురించీ, వాటికి సంబంధించి నా అజ్ఞానం, అవగాహనారాహిత్యాల గురించీ నాకు చురకలేసేటప్పుడు ఆవిడ ఇంగ్లీషులో తప్ప తెలుగులో మాట్లాడదు, ఎందుకోగాని!!!

"అవునవును నీతో సహా మొత్తం ప్రపంచాన్ని మర్చిపోయి, అందులోనే మునిగి తేలుతూ ఉండొచ్చు సర్వకాల సర్వావస్థలయందూ... నీలాగ!!" అన్నాను ఉక్రోషంగా.

"ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకోకుండా ఇలా రెట్టమతంగా మాటాడితేనే నాకు మండేది" నిప్పులు చెరిగింది మా ఫైర్ బ్రాండు. 'చదవడానికి పుస్తకాల్లేవు' అని గోల పెడుతూ ఉంటావు ఎప్పుడూ; కావలసిన పుస్తకాలు కొనుక్కోవచ్చుకదా అంటే... ఎన్నని కొనగలం రిటైరైపోయాక అన్న విషాదగీతం ఎత్తుకుంటావు; అప్పటికీ నాక్కూడా... నీకంటే ఎక్కువే... పెన్షన్ వస్తుంది కదా, రెండు పుస్తకాలు కొనుక్కోలేఁవా అని మొత్తుకుంటూనే ఉంటాను. కాని..." అని, వాక్యం పూర్తిచెయ్యకుండా అసంపూర్తిగా వదిలేసి, తలెగరేసింది గీరగా.

ఒళ్ళు మండిపోయింది నాకు. 'మాట్లాడితే నీకంటే నాకే పెన్షన్ ఎక్కువ వస్తుంది' అని ఎత్తిపొడవడం బాగా ఎక్కువైంది దీనికీమధ్య'... అనుకున్నాను కసిగా. ఏమైనా రిటార్ట్ ఇస్తానేమో, ఎదురుదాడి మరింత ఉధృతం చేద్దామని కొన్ని క్షణాలు ఎదురుచూసిందిగాని, కోపంతో ఉడికిపోతూ నేను నోరెత్తక పోయేసరికి...

"అందుకే నెట్ వాడటం నేర్చుకోమని మొత్తుకునేది. అందులో అయితే, వేలకొద్దీ పుస్తకాలు 'ఫ్రీ'గా దొరుకుతాయి. పైసా ఖర్చు లేకుండా చదువుకోవచ్చు. ఇక 'కిండిల్ ఎడిషన్స్' అయితే ఎంత తక్కువలో దొరుకుతాయో తెలుసా? ఒక్క 'పేపర్ బేక్' కి పెట్టే డబ్బుతో అవి రెండుమూడు కొనుక్కోవచ్చు." అంది బుజ్జగిస్తున్నట్టు సౌమ్యంగా.

"మొదలెట్టావా మహాతల్లీ నీ నస. వదిలెయ్; గంటసేపైనా మనశ్శాంతిగా చదువుకోనీ నన్ను" అన్చెప్పి, బెడ్రూంలోకి వెళ్ళి తలుపులు దగ్గరకి వేసుకున్నాను. కిటికీ పక్కన చదువుకోవడానికి ఏర్పాటు చేసుకున్న 'రిక్లైనర్'లో కూర్చొని, చేతిలో పుస్తకాన్ని తెరిచి, చదవడానికి ఉపక్రమించానుగాని, చదువు మీద మనసు లగ్నం చెయ్యలేకపోయాను. కళ్ళుమూసుకున్నాను విసుగ్గా. ఎప్పటివో జ్ఞాపకాల్లోకి జారిపోయాను అప్రయత్నంగా.

★★★★★

"ఏరా బాబ్జీ, సండేస్కూల్ అయిపోయాక ఎక్కడికి వెళ్ళిపోయావ్? చర్చిలో ఎక్కడా కనబడలేదు?" అడిగింది అమ్మ కోపంగా. చర్చి ఎగ్గొట్టి పక్కనే ఉన్న లైబ్రరీలో కథల పుస్తకాలు చదువుకుంటూ కూర్చున్న సంగతి అమ్మకి తెలిసిపోయిందేమోనని గుండె గతుక్కుమందిగాని...

"చర్చిలోనే ఉన్నానమ్మా. ముందు బెంచీల్లో ఖాళీలేక, వెనక కూర్చున్నాను. అందుకే నీకు కనబడి ఉండను." వినయంగా సమాధానం చెప్పేను. నా కతలు నమ్మిందో లేదోగాని, ఇంకేమీ అనలేదు అమ్మ. "బతుకు జీవుడా" అనుకుంటూ లోపలికి జారుకున్నాను నెమ్మదిగా.

'ఆ రోజులే వేరు. పాఠకుల పాలిట స్వర్ణయుగం' అనుకున్నాను నాస్టాల్జిక్ గా. 'రేడియో పెట్టీ', ' సినిమా హాలూ' తప్ప ఇతర వినోదసాధనాలు ఇంకేవీలేని ప్రశాంతమైన కాలం. ఎటు చూసినా కంటికి ఇంపుగా రకరకాల పుస్తకాలు దర్శనమిచ్చే ఆనందకరమైన రోజులు. చందమామా, బాలమిత్ర; భారతీ, యువ; ఆంధ్రపత్రికా, ఆంధ్రప్రభ... ఇలా లెక్కలేనన్ని వార, పక్ష, మాసపత్రికలూ, అపరాధ పరిశోధక, సాంఘిక, సాహస, కాల్పనిక (రొమంతిచ్) సాహిత్యమూ... పుస్తకాల షాపుల్లో మాత్రమేకాదు, బస్ స్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో, కిళ్ళీ కొట్లలో, కాఫీ హొటళ్ల దగ్గరా,.. ఎక్కడ చూసినా, ఎటు చూసినా... రంగురంగుల సీతాకోకచిలుకల్లా... విరబూసిన గులాబీల్లా... అందంగా, ఆకర్షణీయంగా, కన్నులకింపుగా కనిపించే కమనీయమైన కాలం. పాలకోవానో, పంచదారచిలకనో చూస్తే నోట్లో వేసుకోవాలనిపించినట్టు, వాటన్నింటినీ ఒక్కసారే చదివెయ్యాలన్న తృష్ణతో చేతివేళ్ళలో చిన్నచిన్న కంపనలు వచ్చేసేవి నాకు.

కాకపోతే, దురదృష్టవశాత్తు నాకు రంగురంగుల సీతాకోకచిలుకల్లా కనిపించే ఆ పుస్తకాలన్నీ అమ్మకి మాత్రం భయంకరమైన విషప్పురుగుల్లా కనిపించేవి . పొరపాటున వాటిని చదవడానికి అలవాటు పడితే క్లాసు పుస్తకాలిక

ముట్టుకోననీ, పర్యవసానంగా చదువు వంటబట్టక పరమశుంఠలా తయారౌతాననీ, ఆతరవాత బతుకుబండి లాగించడానికి 'రిక్షాబండి' లాక్కోవడం తప్ప మరో దారి లేకుండాపోతాననీ... ఇలాంటి మూఢనమ్మకాలు చాలానే ఉండేవి అమ్మకి ఆరోజుల్లో. దాంతో, న్యూస్ పేపర్ తప్ప, కథలూ, కాకరగాయలూ ఉండే పుస్తకాలు పూర్తిగా నిషిద్ధం మా ఇంట్లో.

నిజాం పాలనలాంటి నిరంకుశత్వం అది. అందులో జీవిస్తున్న కాలంలో... పెద్ద ఊళ్ళలో గ్రంథాలయాలని ఉంటాయనీ, వాటిని ఇంగ్లీషులో 'లైబ్రరీ'లు అంటారనీ, వాటినిండా బోలెడన్ని పుస్తకాలు ఉంటాయనీ, ఎవరైనా, ఎంతసేపైనా, అక్కడ కూర్చొని, నచ్చిన పుస్తకాలు, నచ్చినంత సేపు, కాణీ ఖర్చు లేకుండా, 'ఫ్రీ'గా చదువుకోవచ్చనీ తెలుసుకోవడం తటస్థించింది. అంతేకాకుండా, అచ్చం అలాంటి 'లైబ్రరీ'నే ఒకటి, మేం ప్రతీ ఆదివారం వెళ్ళే చర్చికి దగ్గలోనే ఉందన్న విషయంకూడా దానితోపాటూ తెలుసుకోవడం జరిగింది. అంతే... ఆ తరవాత ఇక ఏ ఆదివారమూ చర్చిలో భక్తిగా కూర్చున్న పాపాన పోలేదు నేను.

ఆదివారం ఉదయాన్నే ఎనిమిది గంటలకు బైబిల్ చేత్తో పట్టుకొని బుద్ధిగా 'సండేస్కూల్'కి హాజరైపోవడం, అదైపోయాక చడీచప్పుడూ చేయకుండా బయటకు జారుకొని, దగ్గరలోనే ఉన్న లైబ్రరీకి వెళ్ళిపోవడం, అక్కడ కూర్చొని... భేతాళకథలూ, పరోపకారి పాపన్న కథలూ, పేదరాశి పెద్దమ్మ కథలూ, పంచతంత్రం కథలూ... ఇలా ఒకటా రెండా, లెక్క లేనన్ని కథలు కరువుతీరా చదువుకొని, చర్చి అయిపోయే టైంకి ఇంటికి చేరుకోవడం అలవాటుగా మారిపోయింది. ఇదంతా అమ్మకి తెలియకుండా, రహస్యంగా చెయ్యడం ఎంతో 'స్ట్రాంగ్ కిక్' ఇచ్చేది కూడా.

పుస్తకాలతో అలా మొదలైన నా 'లవ్ ఎఫైర్' సంవత్సరాలు గడిచేకొద్దీ ఎంతగా బలంగా తయారైందంటే, యూనివర్సిటీలో చదివే రోజుల్లో ఫ్రెండ్సందరూ క్లాసులెగ్గొట్టి అమ్మాయిలతో బీచికీ, ఇంగ్లీషు సినిమాలకీ ఉడాయిస్తుంటే నేనుమాత్రం లైబ్రరీకి పరుగెత్తేవాడ్ని. 'నాలుగు బుక్కులుంటే చాలీయెదవకి. పెల్లం లేపోయినా పరవాలేదు; సుకంగా బతికీగల్డు!' అని జోకులేసేవాడు శ్రీకాకుళంనుంచొచ్చిన మా క్లాస్మేటొకడు.

'అంతగా ఇమ్మర్స్ అయిపోడానికి ఏముంటాయబ్బా వాటిలో' అని ఆశ్చర్యం వెలిబుచ్చేది శ్రీమతి పెళ్లైన కొత్తలో, 'చదువుతూ చదువుతూ మధ్యలో ఆ తన్మయత్వం దేనికో! చిరునవ్వులు ఎందుకో!! కళ్ళలో నీరు తిప్పుకోవడం ఏఁవిటో!!! ఇవేవీ అర్థవేఁ కాదు నాకు!!!!' అని ఎగతాళి కూడా చేసేది. అంతే కాకుండా, 'నేనా–పుస్తకాలా' అని, 'తల్లా–పెళ్ళామా' లెవెల్లో గంభీరమైన చర్చకు, ఒకదానికి తెరలేపి, అందులోకి తన అమ్మానాన్నల్నీ, అత్తమాఁవల్నీ... అంటే... మా అమ్మనీ, నాన్ననీ... లాగే ప్రయత్నం కూడా షురూ చేసిందిగాని...

'వెధవది, పుస్తకాలదేఁవుందే బంగారం, నీ తరవాతే కదా పుస్తకాలైనా ఇంకేవైనా' అని తెల్లజెండా చేత ధరించి డిప్లొమేటిగ్గా డిక్లేర్ చేసేసరికి విజయోత్సాహంతో ఆ ప్రయత్నం విరమించింది. చదువుకోవడానికి అనుమతి దయచేస్తూ,

'కండిషన్స్ ఎప్లై' అన్న 'రైడర్' తగిలించిందిగాని, కాలం గడిచేకొద్దీ నా పిచ్చికి నెమ్మదిగా అలవాటు పడిపోయి, పట్టించుకోవడం మానేసింది.

కాకపోతే మారుతున్న పరిస్థితుల కారణాన పుస్తకాలు..., 'ప్రింటు పుస్తకాలు' అంటున్నారు వాటినిప్పుడు... కనుమరుగైపోతుండడం మాత్రం భరించలేకపోతున్నాను నేను. దశాబ్దాలుగా చందాలు కడుతూ, ఇంటికి తెప్పించుకుంటున్న పత్రికలు ఇంచుమించు అన్నీ అంతర్ధానమైపోయాయి. నాలాంటి వారికి దేవాలయాల్లా విలసిల్లిన పుస్తకాల షాపులు చాలామట్టుకు చరిత్రలో కలిసిపోయాయి. ముద్రణవ్యయం పెరిగిపోవడంతో పుస్తకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దానితో ఒక పుస్తకం కొనాలంటే రిటైరైపోయిన నాలాంటి వాడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తోంది. అందుకే ఒక పుస్తకం చదవడం మొదలుపెట్టాక అదెక్కడ త్వరగా పూర్తైపోతుందోనన్న భయంతో, ప్రతీవాక్యం పట్టిపట్టి నెమ్మదిగా చదువుకోవడం, ఒకసారి చదివేసాక దాన్నే ఒకట్రెండు సార్లు తిరిగి చదవవడం... అదిచూసి శ్రీమతి ఒంటికాలిమీద లేవడం అలవాటుగా మారిపోయిందీ మధ్య.

'ఈ-బుక్స్ చదవడానికి ఏంటి ప్రోబ్లెం నీకు?' అన్నది ఆవిడ ప్రశ్న. దానికి సమాధానం, తనకు అర్ధమయ్యేలా చెప్పడం నాకు సరిగ్గా తెలిసి చావదు. అప్పటికీ 'ఈ బుక్' కూడా చదవడానికే కావచ్చేమోగాని, చక్కటి పుస్తకాన్ని చేత్తో పట్టుకొని, నచ్చిన వాక్యాన్ని అండర్లైన్ చేసుకుంటూ చదువుతున్నప్పుడు ఎక్కే 'కిక్కే'... వేరనీ, రెండు పెగ్గుల విస్కీ తాగినప్పుడో, బ్రహ్మాండమైన ఫుట్బాల్ మేచ్ చూస్తున్నప్పుడో ఎక్కే 'కిక్'కంటే కూడా అది వందరెట్లు బలమైనదనీ, 'టేబ్'లోనో (తబ్), 'లేప్టాప్'లోనో (లప్తొప్) చదివితే అలాంటి 'ఫీలింగ్' చచ్చినా రాదనీ, అందుకే వాటిలో చదవాలనిపించదనీ, ఇవన్నీ చెప్తే అర్ధమయ్యే విషయాలు కావనీ, చదివేవాళ్ళకు తప్ప అదర్స్ కెన్నాట్ అండర్స్టాండ్ సచ్ సబ్లైం థింగ్స్' అనీ చాలా పెద్ద లెక్చరే ఇచ్చానొక రోజు.

నేను చెప్పినదంతా మౌనంగా విని, ఆ తరవాత పగలబడి నవ్విదావిడ. "చూడండి మేస్టారూ, తమరు చెప్పినది ఎప్పుడో వందేళ్ల క్రితం, టెక్నాలజీ అన్న మాటే వినబడని చీకటిరోజులనాటి కతేమోగాని, ఇరవై ఒకటో శతాబ్దానికి చెందిన కథ మాత్రం కాదు. ఆ కాలంలో చదవడానికి అలా తప్ప, మరో మార్గం లేదు. ఇప్పుడు రోజులు మారాయి. వాటితో పాటూ మీరు కూడా మారాలి. అంతేకాని 'అబ్బే నేను ఛస్తే మారను; మా ముత్తాతలాగే నేనుకూడా 'తాళపత్ర గ్రంధాలు తప్ప మరేమీ ముట్టుకోను' అని మడి కట్టుక్కూర్చుంటే... ఇదిగో, చదివిన పుస్తకాలే మళ్ళీమళ్ళీ చదువుతూ ఇలాగే బతకాల్సి వస్తుంది" అంది వేళాకోళంగా.

ఏం చెప్పాలో తెలియక గుడ్లు మిటకరించుకొని చూస్తూ నిలుచున్న నన్ను చూస్తే, పాపం జాలేసినట్టుంది, దగ్గరగా వచ్చి, తలమీద చెయ్యివేసి, "ఇంచుమించు నలభయ్యేళ్లనుంచీ చూస్తున్నాను. చదవడమంటే నీకు ఎంత ఇష్టమో నాకంటే ఎవరికి ఎక్కువ తెలుసు చెప్పు? ఎంత రిటైరైపోతే మాత్రం, ఎవరో చెప్పినట్టు, నచ్చిన పుస్తకం కొనుక్కున్న పాపానికి చింకిచొక్కా ఒకటి తొడుక్కొని రోడ్లమ్మట తిరగాల్సినంత దయనీయమైన స్థితిలో బతుకుతున్నావా నువ్వు? నెలకొక రెండు

పుస్తకాలు కొనుక్కున్నంత మాత్రాన హెవెన్స్ వోంట్ కం డౌన్ క్రాషింగ్ అని మొత్తుకుంటూనే ఉన్నాను. అయినా నువ్వు కొనుక్కోవు; నన్ను కొనిపెట్టనివ్వవు. చదవడానికేమీ లేవని గోలగోల చేస్తూ, చదివినవే చదువుతూ కూర్చుంటావు. నిన్నలా చూస్తుంటే నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించేవా ఎప్పుడైనా?" అని అడిగింది కోపంగా. అడుగుతున్నప్పుడు ఆమె గొంతు బొంగురుపోయింది; క్షణంలో సగం సేపట్లో, కలువల్లాంటి ఆమె అరవైరెండేళ్ల కళ్ళు రెండూ నీటితో నిండిపోయాయి. నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే లోపలికి వెళ్ళిపోయింది విసురుగా.

శ్రీమతిలో ఒక కొత్తపార్శ్వాన్ని ఆలస్యంగా చూసిన నాకు చాలా అశ్చర్యంగా అనిపించింది. నన్నూ, నా పుస్తకాలనీ, పఠనాభిరుచినీ ఎప్పుడూ వేళాకోళంచేస్తూ మాట్లాడే శ్రీమతి నా మూర్ఖత్వం కారణంగా ఇంతగా బాధ పడుతోందన్న విషయం ఇంతవరకూ గ్రహించనందుకు నామీద నాకు చాలా కోపం వచ్చింది. గిల్టీగా కూడా అనిపించింది. ఆమె తృప్తి కోసమైనా 'ఈ-బుక్స్' చదవడం నేర్చుకొని, 'టెక్ సవ్వీ'గా (తెచ్ సవ్వ్య) మారిపోవాలనీ, తనను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాలనీ గట్టిగా నిర్ణయించుకున్నాను. నేర్పించడానికి కాంప్యూటర్ సెంటర్ నడిపే కుర్రాడొకడితో 'రహస్య ఒడంబడిక' కుదుర్చుకొని, ట్యూషన్ కు వెళ్లడం కూడా మొదలుపెట్టాను మంచిరోజు చూసుకొని!!

అలా ఆరురోజులు గడిచాక, ఏడోరోజు ఉదయం, పదకొండు గంటలప్పుడు, కాలింగ్ బెల్ మోగింది కర్ణకఠోరంగా. విసుగ్గా తలుపు తెరిచాను చదువుతున్న పాతపుస్తకం పక్కన పడేసి. అమెజాన్ డెలివరీ బాయ్. మాటామంతీ లేకుండా పెద్ద పార్సెల్ ఒకటి చేతిలో పెట్టి, హడావిడిగా నిష్క్రమించాడు. 'ఇంత పెద్ద పార్సెల్!! నాకేనా? అనుకుంటూ ఎడ్రస్ చెక్ చేసి, నాకేనని కన్ఫర్మ్ చేసుకొని, తెరిచి చూసాను ఉత్సుకతతో!! నోరు తెరుచుకొని నిలబడిపోయాను ఆశ్చర్యంతో!! ఎందుకంటే... కొత్త కరెన్సీ నోట్లలా మిలమిల మెరుస్తున్న కొత్త పుస్తకాలే దాన్నిండా!! ఒకటీ, రెండూ కాదు... ఏకంగా పది!! ఆనందంతో నోట మాట రాలేదు!! వాటినే చూస్తూ, వాటినుండి వెలువడుతున్న 'సువాసన'ను ఆఘ్రాణిస్తూ, వాటి గురించిన సంక్షిప్తసమీక్షలు చదువుతూ బాహ్యప్రపంచాన్ని మరచిపోయాను!!

అలా ఎంత సమయం గడిచిపోయిందోగాని, ఒంటిమీదకు తెలివి తెచ్చుకొని తలెత్తిచూస్తే... మెరిసే కళ్లతో నన్నే చూస్తున్న శ్రీమతి!!!

COMMENTS